క్లుప్తంగా

భూముల పరిశీలన

తిరుమలాయపాలెం: రైతు భరోసా పథకంలో భాగంగా మండలంలోని జోగులపాడు, జల్లెపల్లి, మహ్మదాపురం తదితర గ్రామాల్లో సాగుకు యోగ్యం లేని గుట్టలు, వెంచర్లను తొలగించేందుకు శుక్రవారం తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, మండల ఏఓ సీతారాంరెడ్డిలు పలు గ్రామాల్లో భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవనీత, సర్వేయర్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్స్ డే

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం డిపోలో డ్రైవర్స్ డే వేడుకలు నిర్వహించారు. శుక్రవారం ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ డ్రైవర్లకు గులాబీ పూలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రయాణికులను ఆర్టీసీ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లది కీలకపాత్ర అని డ్రైవర్లకు అభినందనలు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ రామయ్య, ఎస్‌డీఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీకి నిధులు ఆదా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య వాహనాలకు డీజిల్ వినియోగం తగ్గింది. పారిశుద్ధ్య వాహనాలు, ఇతర వాటికి వినియోగించే ఇంధనం దుర్వినియోగం అవుతుందనే ఆరోపణలతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈనేపథ్యాన వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయడంతో పాటు జీపీఎస్ ఆధారంగానే తిరిగిన కిలోమీటర్లకు డీజిల్ కూపన్‌లు జారీ చేస్తుండడంతోఅక్టోబర్, నవంబర్‌లలో 30 శాతం వరకు ఇంధన ఖర్చు ఆదా అయిందని అధికారులు వెల్లడించారు. ఇక జీపీఎస్ ట్రాకర్‌లు లేని వాహనాలకు అధికారులు డీజిల్ కూపన్‌లు జారీ చేయడం నిలిపివేశారు.

దరఖాస్తు చేసుకోండి

కామేపల్లి: రైతు భరోసా పథకం కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి కోరారు. జనవరి 1, 2025 వరకు వచ్చినా పట్టాదారు పాస్ పుస్తకాల రైతులు మాత్రమే తమ పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్‌లతో పాటు దరఖాస్తు ఫాంలను క్లస్టర్ పరిధిలోని సంబంధిత ఏఈఓలకు అందించాలని తెలిపారు. అదే విధంగా గతంలో పెట్టుబడి సాయం వచ్చిన రైతులు బ్యాంకు లేదా అకౌంట్ నంబర్ మార్చుకునేందుకు అవకాశం ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వితరణ

కూసుమంచి: కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం తరగతుల్లో అల్పాహారం అందించేందుకు కూసుమంచికి చెందిన చెన్ను వెంకటరమణ, రవి, యాదగిరి ముందుకొచ్చారు. తమ తండ్రి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం శుక్రవారం రూ.15వేల నగదును పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ హాఫీజుద్దీన్, శివాలయం చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఖలీమ్, కిరణ్, లింగారెడ్డి, బుచ్చిరెడ్డి, కందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ఉత్సవాలు

కూసుమంచి: మండలంలోని హట్యాతండా దర్గాలో తృతీయ సంవత్సర ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూజారి సైదులు నాయక్ ఆధ్వర్యాన దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. కోలాటాలతో దేవుడి గుర్రాన్ని గ్రామంలో ఊరేగించారు. దీంతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది.

రెండు బైక్‌లు ఢీ..

కామేపల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం..ఏన్కూర్ మండలం తూతలింగన్నపేటకు చెందిన గుంటి నవీన్, మరో యువకుడు శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలపై వస్తూ.. తాళ్లగూడెం స్టేజీ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

కామేపల్లి: ఓ ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొట్టగా భార్యభర్తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. డోర్నకల్ మండలం దుబ్బతండా గ్రామానికి చెందిన ఇస్లావత్ భాష-సుజాత దంపతులు శుక్రవారం వారి కుమారుడిని బైక్‌పై ఏన్కూర్ మండలం మూలపోచారం హాస్టల్‌లో దింపి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో పాన్నెకల్ గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ నెల 11న ఎస్సెస్సీ విద్యార్థులకు నిర్వహించే ప్రతిభా పాటవ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సోమశేఖర్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని మండలాల్లో నిర్వహించే ఈ టెస్ట్‌కు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య, ఏఎంఓ రవికుమార్, సీఎంఓ రాజశేఖర్, డీసీఈబీ కార్యదర్శి ఎం.నారాయణ, పర్యవేక్షలు చావా శ్రీనివాసరావు, కనపర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం

బౌద్ధక్షేత్రానికి మహర్దశ!

- అభివృద్ధికి రూ.2.50 కోట్ల నిధులు
- ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన బౌద్ధక్షేత్రానికి మహర్దశ పడుతోంది. బౌద్ధుల ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లిన ఈ క్షేత్రానికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అయితే, మరింత మంది పర్యాటకులను ఆకట్టుకునేలా కనీస వసతులు లేకపోవడంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యాన పాలేరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ క్షేత్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రూ.2.50కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. నేడు(శనివారం) జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా కథనం.

మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో..

బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు అభివృద్ధిలో భాగంగా రూ.2.50 కోట్లు మంజూరు చేయించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల టూరిజం, పురావస్తు శాఖ అధికారులు ఈ బౌద్ధక్షేత్రాన్ని సందర్శించారు. తాజాగా అదనపు కలెక్టర్ పి.శ్రీజ సైతం పరిశీలించి అభివృద్ధికి ఉన్న అవకాశాలు, రూపొందిస్తున్న ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. త్వరలోనే పనులు మొదలుకానుండగా ఈ క్షేత్రానికి పర్యాటక సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు.



బౌద్ధక్షేత్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, అధికారులు (ఫైల్)

బౌద్ధమతానికి ప్రధాన కేంద్రంగా..

నేలకొండపల్లి–ముజ్జుగూడెం గ్రామాల మధ్యన ఈశాన్య దిక్కుగా ఉన్న ఈ స్థూపం బౌద్ధమతానికి ఇదో ప్రధాన కేంద్రం. ఇక్కడ 1976లో, 1984లో రెండు సార్లు పెద్ద ఎత్తున తవ్వకాలు జరిపి సుమారు 106 అడుగులు వ్యాసం, 60 అడుగుల ఎత్తుతో ఒక ఆకారం తీసుకొచ్చి బౌద్ధస్థూపాన్ని గుర్తించారు. ఈ తవ్వకాల్లో బుద్ధుని పాలరాతి విగ్రహాలు, మృణ్మయ పాత్రలు, మట్టిపూసలు, ఇక్ష్వాకులు, శాతావాహనులు, విష్ణుకుండినులు కాలం నాటి నాణాలు, బుద్ధుని పద్మాసనం, పంచలోహ విగ్రహాలు అనేకం బయట పడ్డాయి. వీటిని పురావస్తు శాఖ అధికారులు మ్యూజియంలో ఉంచారు.

పర్యాటకంగా మరింత అభివృద్ధి..



బౌద్ధక్షేత్రంపై మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించినందున పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందనుంది. అనుకున్నది తడువుగా రూ.2.50 కోట్లను మంజూరు చేయించినందుకు మంత్రికి కృతజ్ఞతలు. పర్యాటకంగా తీర్చిదిద్దితే పర్యాటకుల రాకతో స్థానికంగా వ్యాపారాలూ ఊపందుకునే అవకాశముంటుంది.

– రాయపూడి నవీన్, మాజీ సర్పంచ్, నేలకొండపల్లి

బోటింగ్ ఏర్పాటు చేయాలి...



బౌద్ధక్షేత్రం సమీపాన బాలసముద్రం చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయాలి. తద్వారా క్షేత్రం పరిశీలనకు వచ్చే పర్యాటకులకు మరింత సమయం గడిపే అవకాశం ఉంటుంది. అధికారులు ఈ అంశాన్ని కూడా ప్రతిపాదనల్లో చేరిస్తే మంచిది. అంతే కాక క్రాస్ రోడ్డు నుంచి క్షేత్రం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– జెర్రిపోతుల సత్యనారాయణ, నేలకొండపల్లి

ఆధ్మాత్మిక కేంద్రంగా నిలపాలి



మండల కేంద్రంలో బౌద్ధక్షేత్రం, భక్తరామదాసు ధ్యాన మందిరం, బైరాగి గుట్ట, పలు దేవాలయాలు ఉన్నాయి. వీటన్నింటినీ అభివృద్ధి చేస్తే నేలకొండపల్లి ప్రాంతం పర్యాటకంగా, ఆధ్మాత్మిక కేంద్రంగా మరింత బాగుంటుంది. అదే విధంగా మ్యూజియం ఏర్పాటు చేసి పంచలోహ విగ్రహాలను ఏర్పాటు చేయాలి.

– పాగర్తి సుధాకర్, కొత్తకొత్తూరు

డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: టీజీఓ, డ్రైవర్ల సంఘాల డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరించడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యాన రూపొందించిన 2025 డైరీని ఆవిష్కరించగా.. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి, నాయకులు వాసిరెడ్డి శ్రీనివాస్, కొండపల్లి శేషు ప్రసాద్, టీజీఓ హౌజ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కట్టా కిషోర్, కార్యదర్శి పి.విజయ్‌కుమార్, ట్రెజరర్ జి.రమేష్, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదల శ్రీనివాసరావు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యాన రూపొందించిన డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించగా.. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు సలీం, డ్రైవర్ల సంఘం నాయకులు వేణుగోపాల్, రాములు, శ్రీనివాసరెడ్డి, ఉస్మాన్ అలీ, బండ్ల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్ల సంఘం క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి

మంత్రి తుమ్మలకు వినతి..

ఖమ్మంవ్యవసాయం: పశువైద్య, పశు సంవర్ధక శాఖను పునర్వ్యవస్థీకరించాలని తెలంగాణ రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం ఆధ్వర్యాన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్‌బాబు, జిల్లా సంఘం ప్రతినిధులు శుక్రవారం ఖమ్మంలో మంత్రి తుమ్మలకు 'వెటర్నేరియన్ డైరీ– 2025'ను అందజేసి పునర్వ్యవస్థీకరణ ఆవశ్యకతను వివరించారు. మూగజీవులకు వైద్యం అందించే పశువైద్యాధికారులు 28 ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారని, వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ, రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు అనంతు హరీష్, సంజయ్, ఎం.రాకేష్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఉపేందర్, కార్యదర్శి పి.అశోక్, జి.సుబ్బారావు, కె.కిషోర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల జరిగిన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నగర కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నగర అధ్యక్షుడు యలమందల జగదీష్, ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. వచ్చే నెల మొదటి వారంలో జరిగే వారి ప్రమాణ స్వీకారానికి సంఘం తరఫున మంత్రిని ఆహ్వానించారు. ఈనేపథ్యాన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటికి సైతం ఆహ్వాన పత్రాలు అందించనున్నామని, రాజకీయాలకు అతీతంగా నాయీ బ్రాహ్మణులందరూ కార్యక్రమంలో పాల్గొనాలని అధ్యక్ష, కార్యదర్శులు పిలుపునిచ్చారు.

సినీ నటుడు, గాయకులకు..

ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సాంస్కృతిక సేన ఆధ్వర్యాన 'చాకలి ఐలమ్మ'లో దేశ్‌ముఖ్ దొరగా నటించిన ఖమ్మానికి చెందిన హిమామ్‌తో పాటు చెన్నారంకు చెందిన గాయని షేక్ ఖాజాబిలను శుక్రవారం సన్మానించి పురస్కార ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈమేరకు నగరంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కళాకారుల ఆటపాట కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన అధ్యక్షుడు చక్రాల రఘు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కల్చరల్ ఇన్‌చార్జ్ కానుగుల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫోక్ సింగర్, రచయిత ఫక్రుద్దీన్, దళపతి రాజు, అంబేద్కర్ నాగరాజు, పెద్దపాక విజయ్, గుడిపల్లి పుల్లారావు, సింగర్ రామ, జానపద కళాకారుని సరోజిని, మిమిక్రీ కళాకారుడు సుధాకర్, మొగిలి, తదితరులు పాల్గొన్నారు. అలాగే

బాలికలు అన్నింటా ముందంజ



విష్ణువందనను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మంరూరల్: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని, దేనికీ తీసిపోకుండా ముందుకు సాగాలని జిల్లా బాలికా సంరక్షణ అధికారిణి టి.విష్ణువందన అన్నారు. శుక్రవారం మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికల హక్కులు, బాలికా విద్య పరిరక్షణ, బాలికల సంరక్షణకు సంబంధించి, బాలికలపై జరుగుతున్న అకృత్యాలను వివరించారు. అనంతరం విష్ణువందనను ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీల ప్రారంభ సభలో అదనపు డీసీపీ, డీవైఎస్‌ఓ, పాఠశాల యాజమాన్యం

ఖమ్మంఅర్బన్: క్రీడల్లో తర్ఫీదు పొందడంతో పాటు పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వానికి బాటలు పడతాయని అదనపు డీసీపీ నరేష్‌కుమార్ తెలిపారు. ఖమ్మం పుట్టకోట రోడ్డులోని శ్రీ చైతన్య గ్లోబల్ విస్టా స్కూల్‌లో 'ఉడాన్'పేరిట నిర్వహిస్తున్న క్రీడాపోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనన్నారు. పోటీలతో గెలుపోటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుందని చెప్పారు. డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల ద్వారా క్రమశిక్షణ, సహకార నైపుణ్యాలు మెరుగవుతాయని తెలిపారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖో–ఖో, క్యారమ్స్, చెస్, అథ్లెటిక్స్ పోటీల్లో 1,500మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్పొరేటర్ కరుణాసైదుబాబు, టెన్నిస్ కోచ్ నాగరాజు, పాఠశాలల ఏజీఎం చేతన్ మాధూర్‌తో పాటు జయప్రకాష్, బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు

● ఖమ్మంక్రైం: రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రజలకు నెహ్రూ యువ కేంద్ర, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ట్రాఫిక్ నియమాలపై వివరించగా.. ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఆర్ఐ సాంబశివరావు, నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం ఆఫీసర్ కమర్తపు భానుచందర్, ఎన్ఎస్ఎస్ పీఓలు రామకుమార స్వామి, శ్యామలదేవి, షారుఖ్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

● నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత ట్రాఫిక్ రూల్స్ అవగాహన కల్పించారు. ఏఎంవీఐ సుమలత తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సెంటర్ సందర్శన..

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రధాని మోదీ బడుగు, బలహీన వర్గాలను వారి వృత్తుల్లో రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు విశ్వకర్మ ట్రెనింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేశారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ రైల్వే బోర్డు మెంబర్ మట్టా దుర్గాప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన ట్రెనింగ్ సెంటర్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ జిల్లా కన్వీనర్ దొంతు జ్వాలా నరసింహారావు, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

చివరి రోజూ అదే నిరసనలు..



కొర్లబోడుతండాలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

● రఘునాథపాలెం: నాలుగు సంక్షేమ పథకాలపై లబ్ధిదారుల ఎంపికల కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు చివరి రోజు శుక్రవారం కూడా నిలదీత, నిరసన మధ్య సాగాయి. ఈనేపథ్యాన కొర్లబోడుతండాలో గ్రామసభలో జాబితాల్లో తమ పేర్లు లేవంటూ గ్రామసభ వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. కాగా, బావోజితండా పంచాయతీలో గ్రామ సభ వద్ద గ్రామ కార్యదర్శిని ఉద్దేశపూర్వకంగా దూషించి విధులకు అటంకం కల్గించిన తేజావత్ కుమార్‌పై కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిలు సమక్షాన ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను డిప్యూటీ సీఈఓ నాగపద్మజా పర్యవేక్షించారు. మొత్తంగా మండల వ్యాప్తంగా 40 జీపీల్లో నిర్వహించిన గ్రామ సభల్లో 6,579 దరఖాస్తులు రాగా, అందులో రేషన్ కార్డుల కోసం 3,080, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 155, ఇళ్ల కోసం 3,344 మంది దరఖాస్తులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

● ఖమ్మంరూరల్: లబ్ధిదారుల ఎంపికలో అనర్హులను ఎంపిక చేశారని ఆరోపిస్తూ మండలంలోని గుదిమళ్ల, పెదతండా, ఏదులాపురంలో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో సొంతత పార్టీ వారినే ఎంపిక చేశారని నిరసిస్తూ సభలోనే నిరసన తెలిపారు. పెదతండాలో ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఎలా ఇచ్చారన్నారు. అలాగే వెంకటగిరి గ్రామసభలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్‌బాబు మాట్లాడుతూ.. వెంకటగిరి ఖమ్మం నగరానికి సమీపాన ఉన్నందున సుమారు 500 మందికి ఇందిరమ్మ ఇళ్లు కావాలని తెలిపారు.

న్యాయం చేయాలి

తిరుమలాయపాలెం: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిరుపేదలకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం తిరుమలాయపాలెం గ్రామస్తులు ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ జోక్యం లేకుండా అర్హులను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొమ్ము పూలే, మన్మథరావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామసభలు..

కూసుమంచి: మండలంలో ప్రభుత్వ పథకాల కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజున గురువాయిగూడెం, జక్కేపల్లి ఎస్సీ కాలనీ, లాల్‌సింగ్‌తండా, లింగారంతండా, మంగళితండా, ఎర్రగడ్డతండా గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో ఆందోళనలు జరగనప్పటికీ పలువురు తమ పేర్లను కూడా అర్హుల జాబితాల్లో చేర్చాలని, ఇళ్లు, రేషన్‌కార్డులు ఇప్పించాలని అధికారులకు విన్నవించారు. ఈ సభలను ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు.

దరఖాస్తులు త్వరగా ఆన్‌లైన్ చేయాలి

నేలకొండపల్లి: గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో గ్రామ సభల్లో వచ్చిన అభ్యంతరాలపై చర్చించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చాలా గ్రామాల్లో జాబితాలో పేర్లు ఉన్న వారూ మరోమారు దరఖాస్తు చేసుకున్నారని, కొంత మంది రెండు పర్యాయాలు పెట్టుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, మండల పంచాయతీ అధికారి శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యర్రయ్య

పేదలకు సేవలు అందించాలి



ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: నిరుపేద, బడుగు బలహీన వర్గాల జీవన పోషణ కోసం చేగువేరా భూపతి ఫౌండేషన్ సంస్థ నిస్వార్థంగా పనిచేస్తుందని, వారి సేవలు అమూల్యమని ఖమ్మం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఖమ్మం రాపర్తినగర్‌లోని చేగువీర ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏమి ఆశించకుండా నిస్వార్థంగా ప్రేమించడమే ఫౌండేషన్ ఉద్దేశమని ఆ సంస్థ వ్యవస్థాపకుడు చైర్మన్ జి.చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గంటా భీమయ్య, ఆర్ ఎంపీల వీరభద్రం, మాచర్ల కొండలరావు, పాడిశాల వెంకన్న, కొండ సందీప్, గంటా కృష్ణ , శీను, రాధిక, లత తదితరులు పాల్గొన్నారు

మేయర్ జన్మదిన వేడుకలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ జన్మదిన వేడుకలను కేఎంసీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మేయర్ చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, సిబ్బంది మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేఎంసీ ఈఈ కృష్ణాలాల్, ఏఓ శివలింగం, ఆర్ఓ జె.శ్రీనివాసరావు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వసుంధర, డీఈఈ ధరణికుమార్, ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ప్రదర్శనలతో ప్రచారం

రఘునాథపాలెం: హైదరాబాద్‌లో వచ్చే నెల 7న మందకృష్ణ ఆధ్వర్యాన తలపెట్టిన భారీ ప్రదర్శన విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో పమ్మి రవి బృందం కళాకారులు తమ ప్రదర్శనలు చేశారు. ఎంఎస్‌పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు అంజయ్య పర్యవేక్షణలో మండల ఇన్‌చార్జ్ గాజుల నరసింహారావు, మండల అధ్యక్షుడు మంద గోపాలరావు, కంచర్ల మోహన్, మంద ప్రభాకర్, పెనుగూరి నాగేశ్వరరావు, మంద శేషయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు సరికాదు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణపై అసత్య ప్రచారాలు మానుకోవాలని మాల మహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం అన్నారు. శుక్రవారం ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు(శనివారం) ఖమ్మం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు. సంఘ గౌరవ సలహాదారులు లింగాల రవికుమార్, ఐఎంఎల్ఏ ప్రధాన కార్యదర్శి మర్రి ప్రకాష్, మాల మహానాడు జిల్లా నేతలు వరద నరసింహారావు, కొట్టే సుధాకర్, దాసరి శ్రీనివాస్, బిందె రమేష్, అంబటి పూడి పేతురు, కామా ప్రభాకర్, పంజా నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే యూజీసీ ముసాయిదా నిబంధనలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యాన ఖమ్మం యూనివర్సిటీ పీజీ కళాశాల ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడగా కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్, నాగుల్‌మీరా, వంశీ, జిల్లా నాయకులు రాకేష్, ప్రతాప్, రాజు, రమ్య, శ్రావణి, సుజాత, దీప్తి పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన కలాం స్ఫూర్తి యాత్ర

ఖమ్మంసహకారనగర్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో ప్రారంభమైన కలాం స్ఫూర్తి యాత్ర శుక్రవారం ఖమ్మానికి చేరుకోగా నగరంలోని శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం స్ఫూర్తి యాత్ర బృందం వ్యవస్థాపకుడు మధులాష్ బాబు యాత్రలో భాగంగా బస్సు ద్వారా ల్యాబ్, తదితర వాటిని ఆధునిక సాంకేతికతలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణకుమారి, ఏఎస్ఆర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ గోవిందరావు, పాఠశాల కో ఆర్డినేటర్ ఎం.డాన్‌బోస్కో, బృందం సభ్యులు శ్రీజ సోగల, అర్చన నాగపురి, ఎస్.అజయ్‌రెడ్డి, దిలీప్‌కుమార్, సాయి సుబ్రమణ్యం, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థుల సత్తా

ఖమ్మంసహకారనగర్: ఈ నెల 22, 23 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం రుద్రంపూర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2025లో ఎస్‌బీఐటీ డిప్లొమా విద్యార్థులు కబడ్డీ, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో సత్తా చాటి బహుమతులు గెలుచుకున్నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈనేపథ్యాన శుక్రవారం విద్యార్థులను అభినందించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్,జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ఏఏ జహరుద్దీన్, పీడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో శుక్రవారం భక్తరామదాసు సర్వీస్ సొసైటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా ఏటుకూరి వెంకటరామారావు, ఉపాధ్యక్షుడిగా తెల్లగొర్ల లింగస్వామి, కార్యదర్శిగా జీ.వీ.గుప్తా, కోశాధికారిగా దండా రవీంద్రబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ సేవలను విస్తృత పరచాలని సొసైటీ చైర్మన్ ఏటుకూరి వెంకటరామారావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గూడవల్లి రాంబ్రహ్మం, అనంతు కాశయ్య, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు, సొసైటీ సభ్యులు రఘుపతిరావు, యలమద్ది లెనిన్, వెల్లంపల్లి శ్రీనివాసరావు, గంజికుంట్ల వెంకన్న, షేక్ ఖాసీంసాహెబ్, ఓరుగంటి నారాయణరావు, కొత్తా రమేష్, డి.లక్ష్మణ్‌రావు, దుర్గారావు, మీసా ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.